సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 6 । ఆగస్టు । 2023



ఎస్టీల్లో కలపాలి

ఎస్టీలలో కలపాలని డిమాండ్ చేస్తూ కాయితీ లంబాడీలు పెద్దకొడప్‌గల్ మండలంలో ఆందోళన చేశారు.

- 10లో ▸



ఆధార్ నమోదెలా?

లింగంపేట మండల కేంద్రంలోని ఆధార్ నమోదు కేంద్రం మూత పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /23.0

వాతావరణం


ఉదయం ఆహ్లాదకర గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాలలో జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

ఆనాటి ఆ స్నేహమానంద గీతం..

- దశాబ్దాలుగా కొనసాగుతున్న మిత్ర బంధం
- ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న మిత్రులు
- కలిసికట్టుగా సేవా కార్యక్రమాలతో గుర్తింపు
- నేడు స్నేహితుల దినోత్సవం

'స్నేహమే నా జీవితం.. స్నేహమేరా శాశ్వతం.. స్నేహమేరా నాకున్నదీ.. స్నేహమేరా పెన్నిధీ..' అంటూ ఓ సినీ కవి కలం నుంచి జాలువారిన అక్షరాలు చెలిమి గొప్పతనాన్ని వివరించాయి. జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకం స్నేహం.. వయసు, వరుస, కులమతాలకు అతీతంగా అల్లుకునే బంధమిది.. తరాలు మారుతున్నా.. స్నేహానికి అర్థం, పరమార్థం మాత్రం మారడం లేదు. జీవన గమనంలో మంచి స్నేహితుల అవసరం ఎంతో ఉంటుంది. పలువురు స్నేహితులు తమ బాగు కోసమే కాకుండా.. సమాజం కోసం కూడా తపిస్తున్నారు. కలిసికట్టుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తమ శక్తి మేరకు సమాజ సేవలో భాగస్వాములవుతున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

– సాక్షి, కామారెడ్డి



- మరిన్ని కథనాలు 8లో..

నాలుగు దశాబ్దాల బంధం..



బాన్సువాడ: బాన్సువాడ పట్టణానికి చెందిన షేక్ సలాం (ఇంటర్ నోడల్ అధికారి), నారాయణ(ప్రైవేటు ఉద్యోగి) చిన్నప్పటి నుంచి స్నేహితులు. 40 ఏళ్లుగా వీరి స్నేహ బంధం కొనసాగుతోంది. మతాలు వేరైనా ఇరువురూ ఒక్కటిగా పండుగలు జరుపుకుంటారు. రంజాన్, బక్రీద్‌లకు సలాం తన ఇంటికి నారాయణ కుటుంబాన్ని ఆహ్వానించి విందు ఏర్పాటు చేస్తారు. అలాగే నారాయణ క్రిస్మస్ రోజున సలాం కుటుంబాన్ని ఇంటికి పిలిచి విందు ఇస్తారు. సెలవుల సమయంలో ఇద్దరం కలిసి ప్రశాంత వాతావరణంలో కొంతసేపు గడుపుతామని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటామని సలాం, నారాయణ తెలిపారు.

సేవల్లోనూ దోస్తానా..

సాక్షి, కామారెడ్డి: జిల్లాకేంద్రానికి చెందిన 12 మంది స్నేహితులు జీవితంలో ఉన్నత స్థానానికి చేరారు. కొందరు ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తుండగా, మరికొందరు రాజకీయాల్లో రాణిస్తున్నారు. వారు పదిహేనేళ్ల క్రితం ఎంజీ చక్రవర్తిగౌడ్ సారథ్యంలో సాయి చారిటబుల్ ట్రస్టును స్థాపించి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రధానంగా పేదల ఉన్నత చదువులకు చేయూతనందిస్తున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్లు సాధించి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థుల ఫీజులు చెల్లిస్తూ, హాస్టల్ సౌకర్యం కల్పిస్తూ, దుస్తులు, పుస్తకాలు సమకూరుస్తూ అండగా ఉంటున్నారు. వీరు ఇప్పటివరకు పదిమంది ఇంజినీరింగ్ కల నెరవేర్చారు. నలుగురు వైద్య విద్యార్థుల చదువులకు చేయూతనందించారు. టెన్త్, ఇంటర్ చదివే పేద విద్యార్థులకు కూడా సాయం అందిస్తున్నారు. కరోనా కాలంలో మహమ్మారి బారిన పడిన ఎన్నో కుటుంబాలకు రోజూ వారి ఇళ్లకు భోజనం సరఫరా చేశారు. ట్రస్టు ద్వారా ఇప్పటివరకు రూ.50 లక్షలపైనే ఖర్చు చేశారు. తమ ట్రస్ట్‌లోని అందరు సభ్యుల సహకారంతో ఆయా కార్యక్రమాలు చేపడుతున్నామని సంస్థ కార్యదర్శి, ఉపాధ్యాయుడు కేఎస్ భగత్ 'సాక్షి'తో పేర్కొన్నారు.





కరోనా సమయంలో ఆహారం అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధి, మల్లుపేటలో దుస్తులు పంపిణీ చేస్తూ..

చెలిమే బలం..



నాగిరెడ్డిపేట: గోపాల్‌పేటకు చెందిన శాయిరి కిషన్, మహ్మద్ జావీద్‌ల స్నేహం నాలుగున్నర దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఎవరి ఇంట్లో శుభకార్యం ఉన్నా ఇరుకుటుంబాల సభ్యులు ఒక్కచోట చేరతారు. ఎవరికి ఆపదొచ్చినా క్షణాలలో వాలిపోతారు. ఏడాదిన్నర క్రితం కిషన్ బైక్‌పైనుంచి పడిపోవడంతో కాలికి గాయమైంది. విషయం తెలియగానే జావీద్ వెళ్లి పరామర్శించాడు. ఇంటికి తిరిగి వెళ్తుండగా జావీద్ కూడా కిందపడడంతో అతడి కాలికీ గాయమైంది. వీరి స్నేహాన్ని చూసి గ్రామస్తులు ముచ్చటపడుతుంటారు.

స్నేహం చాలా గొప్పది..

స్నేహం గురించి చెప్పడానికి మాటలు చాలవు. అది చాలా గొప్పది. జీవితంలో స్నేహితుడిని సంపాదించడం కంటే ఆ స్నేహాన్ని నిలబెట్టుకోవడం ముఖ్యమైన విషయం. నా స్నేహితుడు శీతల్ వలీస్ మహారాష్ట్రలో రైల్వే ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. మేమిద్దరం మంచి స్నేహితులం. మా ఇద్దరిదీ సాధారణ కుటుంబ నేపథ్యమే. వీలు దొరికినపుడల్లా కలుస్తాం. తరచూ మంచీ చెడు మాట్లాడుకుంటుంటాం. కష్టసుఖాలను పంచుకుంటాం. మా ఇద్దరి మధ్య ఎలాంటి దాపరికాలు ఉండవు. మంచి స్నేహితులను ఎప్పుడూ వదులుకోవద్దు. – కలెక్టర్ పాటిల్



స్నేహితులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ (ఫైల్)

న్యూస్‌రీల్

కాయితీలకూ పోడు పట్టాలివ్వాలి

- అసెంబ్లీలో జాజాల సురేందర్



నాగిరెడ్డిపేట: కాయితీ లంబాడీలకు సంబంధించిన పోడు భూములకు కూడా పట్టాలు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన అసెంబ్లీ సమావేశాలలో జీరోఅవర్‌లో మాట్లాడారు. ప్రభుత్వం కాయితీ లంబాడీలను కూడా గిరిజనులుగా గుర్తించి, పోడు పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

మద్యం దుకాణాలకు రెండు దరఖాస్తులు



కామారెడ్డి క్రైం: జిల్లాలోని 49 మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకోసం కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఐదు కౌంటర్లను ఏర్పాటు చేశారు. మద్యం దుకాణాల కోసం శనివారం రెండు దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ అధికారి రవీంద్ర రాజు తెలిపారు. అడ్లూరుకు చెందిన ఆర్.ప్రశాంత్‌రెడ్డి రెండు దరఖాస్తులను దాఖలు చేశారన్నారు.

అదనపు కలెక్టర్ పర్యటన



బాన్సువాడ రూరల్: అదనపు కలెక్టర్ మను చౌదరి శనివారం పలు గ్రామాలలో పర్యటించారు. ఇబ్రహీంపేట్ తండా, కోనాపూర్‌లలో అవెన్యూ ప్లాంటేషన్, కంపోస్ట్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డ్, వైకుంఠధామాలను పరిశీలించారు. పనులు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమాలలో ఎంపీపీ నీరజా వెంకట్‌రాంరెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి సాగర్, డీఎస్పీ జగన్నాథంరెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, నాయకులు వెంకటరమణారావ్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి'



కామారెడ్డి రూరల్: ముందు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి సింహారావు పశు పోషకులకు సూచించారు. శనివారం ఉగ్రవాయిలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందన్నారు. టీకాలు వేయిస్తే పశువులను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. పోగులు (పశువుల ఆధార్ కార్డు) లేని పశువులకు పోగులు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జూకంటి సుమిత జనార్దన్‌రెడ్డి, ఏడీ సంజయ్, మండల పశు వైద్యాధికారి రవి కిరణ్, వీఏ సాయిరెడ్డి, సిబ్బంది ప్రవీణ్‌గౌడ్, గోపాల మిత్రులు శ్రీనివాస్, బాలు, రమేష్ పాల్గొన్నారు.

'విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి'



గాంధారి: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని డీఈవో రాజు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆయన మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మెనూలో ప్రవేశపెట్టిన రాగి జావ గురించి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి రాగి జావ తాగారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వెంకటేశ్వర్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'



జెడ్పీ వైస్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీపీఎఫ్‌పై ఉన్న ఆర్థిక ఆంక్షలు తొలగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రుణాలు, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్స్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ మనోహర్‌లకు వినతి పత్రం అందజేశారు. టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు టి.హనుమాండ్లు, శ్రీనివాస్, సాయన్న, లింగం, చక్రపాణి, నళిని దేవి, విజయశ్రీ, మీన, భూషణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి'

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను తక్షణమే క్రమబద్ధీకరించాలని మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.దశరథ్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంగా పనిచేస్తున్నవారిని అదే ఉద్యోగం కోసం మళ్లీ పరీక్ష రాయాలననడాన్ని తప్పుపట్టారు. ఉన్న ఖాళీలలో కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను భర్తీ చేయాలని, మిగతా పోస్టులకు పరీక్షలు నిర్వహించి కొత్తవారిని తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ప్రతినిధులు రేణుక, మంజుల, సరోజ, బాలమణి, సావిత్రి, శోభ, సంగీత, గంగమణి, వాణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్‌ఎంలు

రైల్వే స్టేషన్‌కు హైటెక్ హంగులు!

- 'అమృత్ భారత్'లో రూ.39.90 కోట్లు మంజూరు
- నేడు వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ

సాక్షి, కామారెడ్డి: రైల్వే స్టేషన్లను ఆధునికీకరించి అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ స్కీం తీసుకువచ్చింది. ఈ స్కీంలో కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు ఎంపిక చేసిన కేంద్రం.. రూ.39.90 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీనికి సంబంధించిన పనులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

కామారెడ్డి పట్టణం వ్యాపార, వాణిజ్య రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తోంది. రియల్ ఎస్టేట్‌తో పాటు ఫార్మా వ్యాపారం, రైస్‌మిల్ ఇండస్ట్రీకి కామారెడ్డి అడ్డాగా మారింది. దీంతో పట్టణానికి వచ్చిపోయే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మరోవైపు దక్షిణ మధ్య రైల్వేకు కేంద్రమైన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్ల నుంచి కామారెడ్డి మీదుగా నిజామాబాద్ వరకు రైల్వేలైన్ విద్యుదీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. దీంతో విద్యుత్‌తో నడిచే రైలు ఇంజన్లు తిరుగుతుండడంతో రైళ్ల వేగం పెరిగింది. ప్రస్తుతం కామారెడ్డి రైల్వే స్టేషన్ మీదుగా ఉత్తర, దక్షిణభారతాల మధ్య నిత్యం 55 వరకు రైళ్లు తిరుగుతున్నాయి. రోజూ కామారెడ్డి స్టేషన్‌లో కనీసం 1,500 మంది వరకు టికెట్లు తీసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే పాస్‌ల ద్వారా కూడా నిత్యం వందలాది మంది వచ్చి వెళతారు. ఉద్యోగులు చాలామంది హైదరాబాద్ నుంచి కామారెడ్డికి అప్ అండ్ డౌన్ చేస్తున్నారు. కామారెడ్డిలో పండ్లు, ఫలాలు, కూరగాయలు, ఇతర సామాన్లు అమ్ముకోవడంతో పాటు, కూలీ పనులు, నిర్మాణ రంగ పనులకు అక్కన్నపేట, మిర్జాపల్లి, భిక్కనూరు, ఉప్పల్‌వాయి, సిర్నాపల్లి, ఇందల్వాయి స్టేషన్ల ద్వారా కామారెడ్డికి వందలాది మంది వచ్చి పనులు చేసుకుని తిరిగి రైళ్లలోనే వెళ్తారు. అలాగే గూడ్స్ రైళ్లు కూడా పెద్ద సంఖ్యలో వెళ్తున్నాయి. గూడ్స్ ద్వారా కామారెడ్డి రైల్వేకు ప్రతీ నెలా రూ.2 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది.

పాత, కొత్త పట్టణాల మధ్య..

కామారెడ్డి పట్టణాన్ని రైల్వే లైను రెండుగా విభజించింది. రైల్వే స్టేషన్‌కు ముందు భాగాన పాత పట్టణం, వెనక భాగాన కొత్త పట్టణం ఉంది. అటూ, ఇటూ నిత్యం వేలాది మంది ప్రజలు తిరుగుతుంటారు. పట్టణంలో ఒకే ఒక్క రైల్వే బ్రిడ్జి ఉంది. అది ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంతెన నిర్మాణ సమయంలో ముందుచూపుతో వ్యవహరించకపోవడం ప్రజలకు శాపంగా మారింది. రైల్వే బ్రిడ్జిని విస్తరిస్తేగానీ సమస్య పరిష్కారం కాదు. అలాగే పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఉన్న రైల్వే గేటు అరగంటకోసారి గేటు పడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలకు రైల్వే గేటు మీదుగా వెళ్లే వారంతా రైలు వచ్చినపుడు, పోయినపుడు గేటు పడిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ కూడా బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉంది.

చేపట్టనున్న పనులు..

అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా ప్రస్తుతం ఉన్న రైల్వే స్టేషన్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరిస్తారు. స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, టాయిలెట్స్, ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేస్తారు. అలాగే స్టేషన్ ముందు భాగాన్ని ఆధునికత ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు. రైల్వే స్టేషన్‌కు కావాల్సినంత స్థలం అందుబాటులో ఉండడంతో ఆధునికీకరించడానికి ఏ ఇబ్బందీ లేదు. రెండేళ్లలో పనులను పూర్తి చేస్తామని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

రైల్వే శాఖ విడుదల చేసిన కామారెడ్డి రైల్వే స్టేషన్ నమూనా చిత్రం



మరో మూడు కొత్త పంచాయతీలు



సంబురాలు జరుపుకుంటున్న చిన్నఆత్మకూర్‌వాసులు

- నాగిరెడ్డిపేట మండలంలో రెండు..
- గాంధారి మండలంలో ఒక పంచాయతీ ఏర్పాటు
- సంబురాలు జరుపుకున్న ప్రజలు

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మరో మూడు గ్రామపంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన బిల్లుకు శనివారం అసెంబ్లీ ఆమోదం తెలిపింది. నాగిరెడ్డిపేట మండలంలో చిన్నఆత్మకూర్, కన్నారెడ్డి గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారని జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోతె శ్రీనివాస్, ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ప్రస్తుతం చిన్న ఆత్మకూర్ గ్రామం ఆత్మకూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉంది. కన్నారెడ్డి గ్రామం ధర్మారెడ్డి గ్రామ పంచాయతీలో కొనసాగుతోంది. కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుతో మండలంలో పంచాయతీల సంఖ్య 27కు చేరనుంది. నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు ప్రకటనతో నాగిరెడ్డిపేట మండలంలోని చిన్నఆత్మకూర్‌లో గ్రామస్తులు టపాకాయలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం మిఠాయిలను పంచి హర్షం వ్యక్తం చేశారు. నూతన గ్రామపంచాయతీ ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గాంధారి మండలంలో..

గాంధారి మండలంలోని తిమ్మాపూర్ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పిస్కిల్ గుట్టతండాను గ్రామపంచాయతీగా మార్చారు. దీంతో గాంధారి మండలంలో గ్రామపంచాయతీల సంఖ్య 45కు చేరనుంది.

రైతులకు రెండు లక్షల రుణమాఫీ

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. లక్ష్మాపూర్‌లో శనివారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. సుభాష్‌రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ, కాంగ్రెస్ పథకాల గురించి వివరించారు. అనంతరం ఎల్లారెడ్డి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న సుభాష్‌రెడ్డి

క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలపై కేటీఆర్‌కు వినతి

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయ సమస్యలపై తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి శనివారం మంత్రి కేటీ రామారావును శాసనసభలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజిబోద్దీన్ తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన వివరించారు.

అసెంబ్లీ సమావేశాలను వీక్షించిన టీఎన్‌జీవో నాయకులు



కామారెడ్డి అర్బన్: ప్రభుత్వం, టీఎస్‌వోలది అన్నదమ్ముల బంధమని, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నట్లు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శాసనసభ సమావేశాలను టీఎన్‌జీవో నాయకులు శనివారం స్పీకర్ గ్యాలరీ నుంచి వీక్షించినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా టీఎన్‌జీవో సంఘ భవనానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు స్పీకర్ హామీ ఇచ్చారన్నారు. బి సాయిలు, సంతోష్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

భూ తగాదాలో ఇరువర్గాల ఘర్షణ

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లిలో భూ తగాదలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ శనివారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు.. గ్రామానికి చెందిన వడ్ల సుమలత, నాగరాజు దంపతులు. కొన్నేళ్ల క్రితం కూరాకుల మల్లేశ్ అనే వ్యక్తి సుమలత వాళ్ల స్థలాన్ని సుమారు 36 గజాలు ఆక్రమించి బోరు వేసి కాంపౌండ్ వాల్ నిర్మించాడు. ఈ విషయంపై అనేకసార్లు పోలీస్ స్టేషన్‌లో, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో శనివారం ఉదయం నాగరాజు తమ స్థలంలో కట్టిన కాంపౌండ్ వాల్‌ను కూలగొట్టడానికి యత్నించగా మల్లేశ్ కర్రలతో దాడి చేశాడు. ఈ ఘటనలో నాగరాజుకు గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

ఆపద కాలంలోనూ తోడుగా..

- స్నేహితులకు తోటి మిత్రుల చేయూత
- సేవా సంస్థల ఏర్పాటు
- సమాజ సేవల్లోనూ భాగస్వామ్యం
- నేడు ఫ్రెండ్‌షిప్ డే



వారంత చదువుకుంటున్న సమయంలో స్నేహితులయ్యారు. చదువులు పూర్తయిన తర్వాత కొలువు సాధించి, జీవితంలో స్థిరపడ్డారు. అయినా ఇప్పటికీ అలనాటి మిత్రులను మరువలేరు. మిత్రులంతా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసుకొని ఆపదలో ఉన్న మిత్రులను ఆర్థికంగా ఆదుకుంటున్నారు. అలాగే వారి కుటుంబాలకు భరోసానిస్తున్నారు. సమాజ సేవలోనూ పాలుపంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా వారిపై సాక్షి ప్రత్యేక కథనం..

వారధి సంస్థతో ఒక్కటై..



బాన్సువాడ: కోన బాన్సువాడలోని 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు 2010లో 'వారధి స్వచ్ఛంద సేవ సంస్థ'ను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి నెల స్నేహితులందరూ సమావేశం నిర్వహించుకుని, ఒక్కొక్కరూ రూ.500లను జమ చేస్తున్నారు. జమ చేసిన డబ్బులను ఎవరికైనా ఏ చిన్న ఆపద వచ్చిన సహాయం చేసేందుకు ఉపయోగిస్తారు. అలాగే ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు.

'ఫ్రెండ్స్ ఫర్ ఎవర్' సేవలు



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన 1992–93 పదో తరగతి విద్యార్థులు ఐదేళ్ల క్రితం 'ఫ్రెండ్స్ ఫర్ ఎవర్' పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశారు. నాటినుంచి తమ సంఘంలోని మిత్రులకు ఆపద సమయాల్లో అండగా ఉంటున్నారు. ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవం రోజున మిత్రులందరూ ఖచ్చితంగా కలుస్తున్నారు. అలాగే సమాజ సేవలో తమవంతు చేయూతను అందిస్తున్నారు.

బాల్యమిత్రులకు బాసటగా..



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ ఉన్నత పాఠశాల 1997–98 పదో తరగతి విద్యార్థులు తమ బాల్య మిత్రుడికి బాసటగా నిలిచారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ స్నేహితుడికి ఇటీవల రూ.లక్ష23వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే గన్‌పూర్‌లో ఓ ఫొటోగ్రాఫర్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడటంతో తోటి ఫొటోగ్రాఫర్లు రూ.51వేల ఆర్థికసాయాన్ని అందించారు.



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు, ఆపదలో ఉన్న అలనాటి స్నేహితులకు అండగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్నేహితుడికి రూ.45,000 ఆర్థికసాయాన్ని అందించారు. అలాగే కిడ్నీలు ఫేలైన స్నేహితుడికి రూ.40,000 అందించారు.



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద ఉన్నత పాఠశాల 1984–85 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు సుమారు 15 మంది ఇప్పటికీ స్నేహం కొనసాగిస్తూ, ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకొంటున్నారు. అలాగే పేదలకు సైతం సాయం చేస్తుండటంతో గ్రామస్తులు వారిని అభినందిస్తున్నారు.

స్నేహితులకు ఆసరాగా 'సేవా భారత్ యూత్'



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని 196–97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 2010లో సేవా భారత్ యూత్ సంస్థను ప్రారంభించారు. అప్పటినుంచి వారు పేదలకు సహాయం చేయడంతోపాటు, స్నేహితుల్లో అవసరమైన వారికి ఆర్థికసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నిరుద్యోగుల కోసం..



రాజంపేట: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన నీరడి అశోక్ కుమార్, ప్రవీణ్, బర్ల రవికుమార్, కడెం స్వామి, బోగరి శ్రీను చిన్ననాటి నుంచి కష్టపడి చదివి, ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి, జీవితంలో స్థిరపడ్డారు. నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని ఇటీవల గ్రామంలోని గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు.

వీధుల్లో బాల్యం బందీ



ప్లాస్టిక్ వస్తువుల సేకరణకు వెళ్తున్న బాలికలు

బాన్సువాడ: పుస్తకాలు చేతపట్టుకుని బడులకు వెళ్లాల్సిన బాలలు, రోడ్లపై పాత వస్తువుల సేకరణకు బందీగా మారుతున్నారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాల్సిన విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉండడంతో వారు ఈ వయసులో రోడ్లపై తిరుగుతున్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ ముందు నుంచి కొంతమంది బాలికలు, చిన్నారులు శనివారం సంచులను పట్టుకుని పాత వస్తువులు, ప్లాస్టిక్ వస్తువుల సేకరణ కోసం వెళ్తున్న సమయంలో సాక్షి తీసిన దృశ్యం ఇదీ. ఇప్పటికైనా అధికారులు స్పందించి బడి బయట ఉన్న చిన్నారులను బడిలో చేర్పించేలా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

సబ్సిడీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి: మహిళల సాధికారతలో భాగంగా పీఎంఎఫ్‌ఎంఈ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకులు 35 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తున్నట్లు డీఆర్‌డీవో చందర్ నాయక్ తెలిపారు. ప్రతి స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) సభ్యురాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ)లో నిర్వహించిన జిల్లా మహిళా సహకార సమాఖ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సొంత భవనాలు లేని మండల సమాఖ్య (ఎంఎస్)లకు భవనాల కోసం స్థలం ఇప్పించాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేయాలని డీఆర్‌డీవో సూచించారు. అలాగే మార్కెటింగ్ విస్తరణ కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని ఎమ్మెల్యేను అడగాలని పేర్కొన్నారు. స్త్రీనిధిలో 276 గ్రామ సంఘాల్లో 959 ఎస్‌హెచ్‌జీలలో 1800 మంది సభ్యులకు రుణాలను అందించినట్లు తెలిపారు. రుణాల రికవరీ కూడా 80శాతం ఉండటం హర్షణీయమన్నారు. స్త్రీనిధి ద్వారా డెయిరీఫారం, సోలార్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటోలు, జెనరిక్ మెడికల్ షాపులకు రుణాలు అందిస్తారని తెలిపారు.

పూర్తి స్థాయి నేర విచారణ కీలకం

ఖలీల్‌వాడి: నేరాలు జరిగినప్పుడు పోలీసు, అటవీ అధికారులు నిర్వహించే పంచనామా, రిమాండ్ రిపోర్ట్, చార్జిషీట్లు కీలకమైనవని నిజామాబాద్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో పోలీసు, అటవీశాఖ అధికారుల కోసం నిర్వహించిన సెమినార్‌లో పలు నేర పరిశోధన అంశాలను వివరించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మహమ్మద్ రహిమొద్దీన్, భూసారపు రాజేష్ పంచనామా, రిమాండ్ రిపోర్టు, చార్జిషీట్‌ల రూపకల్పన విధివిధానాల గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొడిపల్లి(నర్సాపూర్): అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించే యత్నంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన శనివారం మెదక్ జిల్లా కొడిపల్లిలో చోటు చేసుకుంది. కొడిపల్లి ఎస్సై శివప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన వడ్ల రాజు (32) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అతడి చెల్లెలి వద్దకు బావమరిది రామస్వామితో కలిసి బొంతపల్లికి వచ్చాడు. రాత్రి అక్కడే ఉండి, శనివారం ఉదయం శెట్టిపల్లి సంగారెడ్డికి చెందిన రామస్వామి తమ్ముడు సతీష్‌తో కలిసి వీరభద్రస్వామి ఆలయంలో దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం రాజు, సతీష్ ఇద్దరు కలిసి అక్కడి నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. కొడిపల్లి బట్టమ్మదేవి ఆలయం వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి రేలింగ్‌కు ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. సతీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడి చెల్లెలు మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజు తండ్రి అనారోగ్యంతో మంచానికే పరిమితం కాగా భార్య నిండు గర్భిణి.

ఎస్టీల్లో కలపాలని కాయితీ లంబాడీల ధర్నా



బేగంపూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న కాయితీ లంబాడీలు

పెద్దకొడప్‌గల్: తమను ఎస్టీల్లో కలపడంతో పాటు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కాయితీ లంబాడీలు డిమాండ్ చేశారు. కాయితీ లంబాడీల యూత్ మండల అధ్యక్షుడు బామాన్ రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం బేగంపూర్ చౌరస్తా వద్ద 161 జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. సుమారు అరగంట పాటు ధర్నా చేయడంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. జెడ్పీటీసీ చంద్రబాగా మాట్లాడుతూ.. కాయితీ లంబాడీలను ఎస్టీల్లో కలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం లంబాడీలకు మాత్రమే పోడు పట్టాలిచ్చిందని తమకు కూడా పట్టాలు ఇవ్వాలని కోరారు. పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా ఆయనతో ఆందోళనకారులు వాగ్వాదం చేశారు. అనంతరం ధర్నా విరమించి, తహసీల్దార్ దశరథ్‌కు వినతి పత్రం అందజేశారు. కూబ్యానాయక్ తండా సర్పంచ్ నానక్ సింగ్, నరేష్, గంగాసింగ్, బచ్చన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆస్తి కోసం నానమ్మ హత్య



శోభారాణి (ఫైల్)

నిజాంసాగర్: ఆస్తి, నగల కోసం వరుసకు నానమ్మ అయ్యే మహిళను హత్య చేశాడో యువకుడు. మద్యం తాగించి అటవీ ప్రాంతంలో అంతమొందించి ఏమి ఎరుగనట్లు ఇల్లు చేరాడు. నిజాంసాగర్ మండలం మాగి శివారులోని అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. పిట్లం మండల కేంద్రానికి చెందిన దత్తుకు ముగ్గురు భార్యలు ఉన్నారు. మొదటి భార్య అంజవ్వ మనవడు సంతోష్, మూడో భార్య శోభారాణి(45)ని ఈ నెల 2న నిజాంసాగర్ ప్రాజెక్టు సందర్శనకు బైక్‌పై తీసుకొచ్చాడు. ప్రాజెక్టును చూసిన తర్వాత బైక్‌పై నిజాంసాగర్‌కు చేరుకున్నారు. అక్కడ మద్యం తీసుకున్న సంతోష్ నానమ్మను మాగి శివారులోని అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లాడు. అక్కడ ఇద్దరు కలిసి మద్యం తాగారు. అనంతరం సంతోష్, శోభారాణి తలపై కర్రతో కొట్టి చంపాడు. అనంతరం సాయంత్రం వేళ పిట్లం చేరుకున్నాడు. రాత్రి వరకు శోభారాణి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సంతోష్‌ను అడుగగా పిట్లంలో దించినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు పిట్లం పోలీస్ స్టేషన్‌లో శోభారాణి మిస్ అయినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని సంతోష్‌ను విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. సంతోష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఘటన స్థలానికి తీసుకువచ్చారు. ఘటన స్థలాన్ని సీఐ మురళి పరిశీలించారు. శోభారాణి ఒంటిపైన ఉన్న నగలతో పాటు ఆస్తి కోసం సంతోష్ హత్య చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

పేకాట స్థావరంపై దాడి

గాంధారి: గాంధారి సమీపంలో శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్లు సదాశివనగర్ సీఐ రామన్ తెలిపారు. వారి నుంచి రూ.52,770, ఆరు బైక్‌లు, 10 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు సదరు పేకాట స్థావరంపై ఎస్పీ ఎస్సై సంతోష్‌తో కలిసి దాడి చేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మద్నూర్: మండలంలోని అవాల్‌గావ్‌లో శుక్రవారం రాత్రి షబ్బీర్ చౌస్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది, వెంటనే ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో ప్రమాదం తప్పిందని బాధితుడు తెలిపారు. శనివారం రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించారు.

కలుపు తీస్తుండగా యంత్రంలో ఇరుక్కుపోయిన కాలు

సదాశివనగర్: సదాశివనగర్‌కు చెందిన గంగొల్ల శంకర్ తన పత్తి చేనులో యంత్రంతో కలుపు తొలగిస్తుండగా యంత్రం అదుపుతప్పి కాలుపైకి దూసుకొచ్చింది. దీంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఠాణాలో ఉపసర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మాచారెడ్డి: గ్రామంలో జరిగిన గొడవ విషయంలో తనకు న్యాయం జరగలేదని ఓ ఉపసర్పంచ్ ఠాణాలో ఆత్మహత్యకు యత్నించాడు. పాల్వంచ మండలం వాడి ఉప సర్పంచ్ సంగారెడ్డికి అదే గ్రామానికి చెందిన సమీప బంధువు బస్వారెడ్డికి వారం రోజుల కిందట పొలం వద్ద దారి విషయంలో గొడవ జరిగింది. ఆ గొడవలో సంగారెడ్డి మెడలో ఉన్న బంగారు గొలుసు తెగిపోయి దాని లాకెట్ గల్లంతైంది. ఈ నేపథ్యంలో గ్రామంలో పంచాయతీ నిర్వహించిన పెద్ద మనుషులు తీర్పు చెప్పారు. ఆ తీర్పుతో సంతృప్తి చెందని సంగారెడ్డి శనివారం క్రిమిసంహారక మందు తీసుకొని ఠాణాకు వచ్చి తనకు న్యాయం చేయాలంటూ ఆ మందు తాగబోయాడు. అక్కడే ఉన్న ఏఎస్సై రామేశ్వరరెడ్డి ఆ మందును లాక్కొడానికి యత్నించాడు. ఆ పెనుగులాటలో ఏఎస్సై కింద పడిపోయాడు. దీంతో ఆగ్రహించిన పోలీసులు ఉపసర్పంచ్‌ను బయటకు పంపించారు.

మెంట్రాజ్‌పల్లిలో వివాహిత ఆత్మహత్య

- అత్తింటి వారే హత్య చేశారని బంధువుల ఆరోపణ
- అనుమానాస్పద మృతిగా కేసు



మగ్గిడి లలిత (ఫైల్)



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

డిచ్‌పల్లి: అత్తింటి వేధింపులకు మరో యువతి బలైంది. మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన స్వప్న అలియాస్ లలిత(30)ను మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మగ్గిడి వినోద్‌కు ఇచ్చి ఆరేళ్ల క్రితం వివాహం చేశారు. వినోద్ కొద్ది రోజులు గల్ఫ్‌కు వెళ్లి వచ్చి ఇక్కడే పెయింటర్‌గా పని చేసుకుంటున్నాడు. ఈ దంపతులకు పిల్లలు కలుగలేదు. ఏడాదిగా గొడవలు మొదలయ్యాయి. పెద్ద మనుషుల పంచాయతీ నిర్వహించి సర్ది చెప్పడంతో కాస్త సద్దుమణిగాయి. అయితే మూడు రోజులుగా మళ్లీ గొడవలు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున లలిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అత్త కమల గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే లలిత మృతి చెందింది. వెంటనే పోలీసులతో పాటు మృతురాలి తరపు బంధువులకు సమచారం ఇచ్చారు. భర్త వినోద్ ఆ సమయంలో వేరే ఊళ్లో ఉన్నాడు. విషయం తెలియగానే ఇంటికి చేరుకున్నాడు. అదే సమయంలో మృతురాలి బంధువులు పెద్ద సంఖ్యలో మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చేరుకున్నారు. అత్త కమల, భర్త వినోద్‌తో పాటు ఆడపడుచులు అదనపు కట్నం తేవాలంటూ లలితను వేధించేవారని వారు ఆరోపించారు. లలితను భర్త, అత్త హత్య చేసి ఆత్మహత్యగా ప్రచారం చేస్తున్నారని, ఆమె ఒంటిపై ఉన్న గాయాలే అందుకు నిదర్శమని ఆగ్రహంతో ఇంటిపై దాడి చేశారు. మృతురాలి భర్త, అత్త ను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించకుండా అడ్డుకున్నారు. డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై మహేష్ మృతురాలి బంధువులను సముదాయించారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో బంధువులు శాంతించారు. మృతురాలికి తల్లిదండ్రులు లేకపోవడంతో పెదనాన్న సింగరి అబ్బయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి, వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. భర్త వినోద్, అత్త కమలను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్, డిచ్‌పల్లి తహసీల్దార్ రాజేందర్ చేరుకుని లలిత మృతదేహాన్ని సందర్శించారు.

గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యం



ప్రణవ్ మృతదేహం



వేణు మృతదేహం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే కాకతీయ కాలువలో మెండోరా శివారులో శుక్రవారం గల్లంతైన నిజామబాద్‌లోని గాయత్రినగర్‌కు చెందిన వేణు(24), ప్రణవ్(19) మృతదేహాలు శనివారం కాలువలో లభ్యమయ్యాయి. శుక్రవారం నీటి విడుదలను నిలిపి వేసి కాలువలో గాలింపు చర్యలను ప్రారంభించారు. చీకటి పడటంతో గాలింపు ఆపి, శనివారం ఉదయం నుంచి ప్రారంభించారు. గల్లంతైన ప్రాంతానికి కొద్ది దూరంలో ప్రణవ్ మృతదేహం లభించింది. గల్లంతైన ప్రాంతంలోనే వేణు మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేవామని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

మంత్రి దిగ్భ్రాంతి

బాల్కొండ: కాకతీయ కాలువలో వేణు, ప్రణవ్ గల్లంతుపై రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అధికారులకు ఫోన్ చేసి ఘటనపై ఆరా తీశారు. కాలువ వద్ద ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. మృతుల కు టుంబాలకు సానుభూతి తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

మోర్తాడ్: మండలంలోని పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను భూగర్భ ఖనిజాల శాఖ అధికారులు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఎవరు ఇసుకను తరలించినా ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. సీజ్ చేసిన వాహనాన్ని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద: మండలంలోని శెట్లూర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ భరత్, ఆర్ఐ సాయి బాబా గ్రామానికి వెళ్లి మంజీర నుంచి ఇసుక తీసుకు వస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

నవీపేట: మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన మేకల మారుతి(46) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మొదటి భార్య కాపురానికి రాకపోవడంతో మారుతి మహారాష్ట్రకు చెందిన రేఖను రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో రేఖ పుట్టింటికి వెళ్లింది. మారుతి ఆమెను తీసుకు రావడానికి వెళ్లగా భర్తతో వచ్చేందుకు నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన మారుతి శుక్రవారం నిజాంపూర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్యతో గొడవ పడి ఒకరు..

మాచారెడ్డి: భార్యతో గొడవ పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం పాల్వంచ మండలం ఇసాయిపేటలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి స్వామి(35) అతని భార్య రోజా శుక్రవారం రాత్రి గొడవ పడ్డారు. ఉదయం చేనుకాడికి వెళ్లొస్తానని చెప్పిన స్వామి మనస్తాపంతో పంట చేను వద్ద చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోడు భూమి విషయంలో ఘర్షణ



సిరికొండ: మండలంలోని జంగిలోడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల మెట్టు తండాలో పోడు భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు.. జరుపుల లింబాద్రి, జరుపుల సురేష్, జరుపుల మోహన్, గుగులోతు నౌసీలాల్ వర్గం, గుగులోతు లింబాద్రి, గుగులోతు మంగిలాల్ వర్గం మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో గుగులోతు లింబాద్రి, మంగిలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో వర్గానికి చెందిన నలుగురికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై ఇరు వర్గాలు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

లింగంపేట: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన గ్యారబోయిన సవిత(32) అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 2న సవితకు ఆమె భర్తకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో శుక్రవారం లింగంపేట సంతకు వెళ్లిన సవిత తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో భర్త రామచంద్రం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.